వద్దురా బాబు.. అంటే వినరే..!

మద్యం మత్తుకు రూ.కోటి జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

తాగి వాహనం నడపొద్దు... ప్రాణం అత్యంత విలువైనది.. అంటూ పదేపదే పోలీసులు గుర్తు చేస్తున్నా.... కూటమి ప్రభుత్వం వీధివీధికి ఏర్పాటు చేసిన మద్యం షాపులు తెగ ఆకర్షిస్తూ మద్యం ప్రియుల మతిని పోగొడుతున్నాయి.. విద్యుత్ దీపాల కాంతులతో ఆకర్షణీయమైన బోర్డులు, ఆఫర్లు, బార్లను తలపించేలా మద్యం షాపులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో తలతల మెరిసిపోతున్నాయి..

గత ప్రభుత్వం నాసిరకం బ్రాండ్లతో మద్యం ప్రియుల ఉసురు పోసుకుందని, ఎన్నికల్లో తీవ్రస్థాయిలో మండిపడ్డ కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక రకరకాల బ్యాండ్లు అందుబాటులోకి తీసుకొచ్చారు. మద్యం షాపుల్లో తలతల మెరుస్తూ మద్యం ప్రియులను తెగ ఆకర్షిస్తున్నాయి. ప్రతి మద్యం షాపుకు ఆనుకొని మద్యం తాగేందుకు షెడ్లు సైతం ఏర్పాటు చేశారు. పోలీసులు ఓ పక్క డ్రంక్ అండ్ డ్రైవ్ పేరిట దాడులు చేస్తున్నారు.. అలాంటప్పుడు మద్యం షాపుల సమీపంలో మద్యం తాగేందుకు షెడ్లు ఏర్పాటు ఎందుకనే ప్రశ్న తలెత్తుతోంది.

జిల్లా కేంద్రమైన చిత్తూరులో డ్రంక్ అండ్ డ్రైవ్ పేరుతో ట్రాఫిక్ పోలీసులు నిఘా పెడుతూ తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డ వారిని కోర్టులో హాజరు పరిచి ఒక్కొక్కరి నుంచి రూ.10వేలు జరిమానా విధిస్తున్నారు. ఏడాది కాలంలో తాగి వాహనం నడిపిన వారికి రూ.కోటి లక్ష రూపాయలు జరిమానా, మద్యం ట్రాక్స్‌తోపాటు అదనంగా మరో కోటి రూపాయలు



ప్రభుత్వానికి అదనంగా మద్యం ప్రియులు కప్పం కట్టారు.

ఓ వైపు రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, జిల్లాలోని ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేదా భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ పోలీసులు పదేపదే హెచ్చరిస్తున్నప్పటికీ తాగిన మత్తులో వాహనం నడిపి పోలీసులకు పట్టుబడుతున్న వారు జరిమానాలు చెల్లిస్తున్నారు తప్ప.. మార్పు రావడం లేదు.. మద్యం తాగిన వ్యక్తి డ్రైవింగ్ చేయడంపై సెక్షన్ 185 క్రింద మొదటిసారి నేరం చేస్తే రూ.10,000లు జరిమానా, లేదా 6 నెలల జైలు శిక్ష, లేదా రెండును విధించవచ్చు. అదే రెండవ సారి అయితే రూ.15,000లు లేదా 3 సంవత్సరాల జైలు శిక్ష, లేదా రెండును విధించవచ్చునని కావున వాహనం నడిపే సమయంలో వాహనదారులు రోడ్డు భద్రతా, రహదారి నిభందనలు తప్పక పాటించి ప్రమాదాలు, జరిమానాలు, శిక్షలకు గురి కాకుండా ఉండాలని పోలీసు శాఖ సూచిస్తోంది.

గ్రామీణ రోడ్ల దుస్థితి మారదా..?

గుంతలమయంగా ఉన్న ఆలపాక కండ్రిగ - జీఎం పురం రోడ్డు

ప్రజాశక్తి- విజయపురం

గ్రామీణ రోడ్లు రోత పుట్టిస్తున్నాయి. అడుగుకో గుంతతో అధ్వానంగా మారాయి. కనీసం నడిచివెళ్లేందుకు కూడా వీలులేని దుస్థితికి చేరాయి. ఇక ద్విచక్ర వాహనదారులు, పెద్ద వాహనాలపై రాకపోకలు చేసేవారికి నరకం చూపిస్తున్నాయి. రోజూ పలు రోడ్లపై ప్రమాదాలు జరుగుతూ వాహనచోదకులు గాయాలపాలవుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రోడ్ల మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

"సారూ... రోడ్డులో గుంతలు పూడ్చండి" అంటూ మండలంలోని మహారాజపురం వాసులు కోరుతున్నారు. కనకమ్మసత్రం - మహారాజపురం సరిహద్దు రోడ్డు గుంతలమయమైన ప్రదేశంలో ఉన్న షాపుల మందర వాహనాలు నిలబెట్టడం వలన తరచూ ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. మహారాజపురం రోడ్డు గుంతల్లో కోళ్ళ రక్తాన్ని, అవశేషాలను పారపోయడం వలన దుర్వాసన వెదజల్లుతుందని అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు. మండలంలోని ఆలపాక కండ్రిగ - జీఎం పురం రోడ్డు గుంతలమయంగా ఉందని రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గాలివాన బీభత్సం...

- నేల రాలిన మామిడి
- నష్టపోతున్న మామిడి రైతులు

ప్రకృతి వైపరీత్యంతో నిత్యం అన్నదాత ఏదో విధంగా నష్టపోతూనే ఉన్నారు. ఈ ఏడాది కాస్త కుదురుకున్నాం.. అన్న సమయంలోనే వైపరీత్యం కారణంగా నష్టాల భారంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ మారు మామిడి కాస్త ఆశాజనకంగా ఉన్న నేపథ్యంలో అకాల గాలివాన బీభత్సంతో కుదేలు అవుతున్న పరిస్థితి.

ప్రజాశక్తి- పూతలపట్టు:

మండలంలో శనివారం రాత్రి అకాల గాలివాన బీభత్సంతో మామిడి పంట పెద్ద ఎత్తున నేలరాలింది. ఈ మారు పంట ఆశ జనకంగా ఉండడంతో అప్పుల ఊబి నుంచి కాస్త ఉపశమనం లభిస్తుందన్న సమయంలో ప్రకృతి దాటికి రైతు తలవంచక తప్పలేదు. పూతలపట్టు, తలుపులపల్లి , ఎర్ర చెరువుపల్లి, వడ్డేపల్లి తదితర గ్రామాల్లో అత్యధికంగా మామిడి పంట నష్టపోయినట్టు ఉద్యాన శాఖ వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్నిచోట్ల మామిడి చెట్లు నేలకొరిగాయి. పంటతోపాటు సంవత్సరాలు తరబడి పెంచుకున్న మొక్కలు సైతం నేల కొరగడం తో రైతులకు మరింత నష్టాన్ని మిగిలించింది.

కష్టాలు తప్పడం లేదు..

- లోకనాథ నాయుడు, మామిడి రైతు

ప్రతి ఏడాది ప్రకృతి వైపరీత్యంతో ఏదో ఒక విధంగా రైతులు నష్టాలను చవిచూస్తూనే ఉన్నాం. ఈ ఏడాది నష్టాల నుంచి ఊపిరి పీల్చుకుందాం అనే లోపే వైపరీత్యంతో తిరిగి అప్పుల ఊబిలోకి కూరుకు పోవాల్సి వస్తుంది. మామిడి పంట నష్టపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

టిటిడిపై కరుణాకర్ రెడ్డి వ్యాఖ్యలు అమానుషం

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

ప్రజాశక్తి- పూతలపట్టు : రెండుసార్లు టిటిడి ఛైర్మన్‌గా పనిచేసిన కరుణాకర్ రెడ్డి అదే దేవస్థానంపై రాజకీయ కక్షలతో విషం కట్టడం తల్లిపాలు తాగి తల్లి రొమ్మును గుద్దడమేనని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మండిపడ్డారు. గోశాల పశువులు వయసు భారంతో, అనారోగ్యంతో మృతి చెందితే వాటిపై రాజకీయం చేయడం దుర్మార్గమన్నారు. లడ్డు కల్తీ, నెయ్యి వివాదంపై సీఐడీ దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో ప్రజల దృష్టి మళ్లించడానికి గోశాలపై విషం చిమ్ముతున్నారని ఆరోపించారు. అసలు గోశాలకు సంబంధించిన ఫోటోలు ఏవిధంగా బయటికి వచ్చాయో చెప్పాలన్నారు. గత వైసిపి పాలనలో టీటీడీ అధికారులు అనేక ఇబ్బందులు పడ్డ విషయాలను ఆయన గుర్తు చేశారు. సోమవారం జరిగే అంబేద్కర్ జయంతిని అంగరంగ వైభవంగా పూతలపట్టు మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్టు చెప్పుకొచ్చారు. సుమారు పదివేల మంది ఈ కార్యక్రమానికి హాజరుకానున్నట్టు తెలిపారు. నాయకులు దొరబాబు, గిరి నాయుడు అమర్నాథ్ నాయుడు చంద్రమౌళి నాగరాజా తదితరులు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం: ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు అర్బన్ : కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వైసిపి నాయకుడు కరుణాకర్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. టిటిడిపై తప్పుడు ప్రచారం చేస్తూ, మత విద్వేషాలు రెచ్చగొడుతున్న కరుణాకర్ రెడ్డిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిటిడి గోశాలలో 100 పశువులు మృతి చెందాయని కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, టిటిడి ప్రతిష్టను దిగజార్చే క్రమంలో వైసిపి నాయకులు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. గత వైసిపి పాలన కంటే ప్రస్తుత కూటమి ప్రభుత్వం గోశాలను ఎంతో సమర్ధవంతంగా నిర్వహిస్తోందని, శుభ్రత, పశువుల ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. వృద్ధాప్యం, ఇతర వ్యాధులతో పశువులు మరణించడం సాధారణంగా జరిగే విషయమేనని.. కేవలం టిటిడి ప్రతిష్టను దెబ్బతీయాలనే దురాలోచనతో వంద పశువులు మృతి చెందాయని తప్పుడు ప్రచారం చేయడం దారుణమన్నారు. గోశాలను సందర్శించిన భక్తులు సైతం గోశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, వైసీపీ నాయకులు ఇకనైనా బుద్ధి తెచ్చుకొని తప్పుడు ప్రచారాలు మానుకోవాలని సూచించారు.

రైతుల చేతిలో డిజిటల్ శక్తి

మారనున్న వ్యవసాయ విధానాలు

మురళీకృష్ణ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్

ఇంటర్వ్యూ

మురళీకృష్ణ
వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాల సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. వ్యవసాయ రంగంపై ఆధారపడిన రైతులకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందించడంతో పాటు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుంది. 20 సంవత్సరాల క్రితం మొబైల్, కంప్యూటర్ వాడకం గురించి పెద్దగా అవగాహన లేనప్పటికీ, స్మార్ట్ ఫోన్ల సహకారంతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయవచ్చు, మీ పంటలను నేరుగా వినియోగదారునికి అమ్మవచ్చు. ప్రస్తుత సమాజంలో ఫోన్లు, కంప్యూటర్ల వాడకం చిన్న బిడ్డ నుండి పండు ముసలివారి వరకు నిత్య జీవితంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ మురళీకృష్ణ అంటున్నారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలు రైతులకు అందిస్తున్న మొబైల్ యాప్ సేవలు గురించి తెలియజేశారు.

ప్రజాశక్తి : స్కిల్ యాప్ చిత్తూరు డిజిటల్ లక్ష్యం ఏమిటి..?

జెడి: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన పెంపొందించడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చుననే దృఢ సంకల్పంతో చిత్తూరు జిల్లాలో రైతు సేవాకేంద్రాల ద్వారా రైతులకు శిక్షణ కల్పించే దిశగా వినూత్న ఆలోచనతో స్కిల్ యాప్ చిత్తూరు డిజిటల్ ట్రైనింగ్ కార్యక్రమం మొదలైంది.

ప్రజాశక్తి: స్మార్ట్ ఫోన్ యాప్ సేవల ద్వారా ప్రయోజనం ఉందా..?.

జెడి: మారుతున్న కాలానుగుణంగా వ్యవసాయ సాగు పద్ధతులు కూడా మారుతున్నాయి. విత్తనం నుండి విక్రయం దాక, వాతావరణం నుంచి నేటి మార్కెట్ విక్రయ వివరాల వరకు ప్రతీ విషయం ఇప్పుడు మన గుప్పెట్లో ఉంది. క్షేత్రస్థాయి వివరాలను రికార్డ్ చేయడానికి, పొలంలో వ్యవసాయ వనరులను వినియోగించుకోవడానికి, రైతుల ఫోన్‌లో అందుబాటులో ఉండే వివిధ రకాల యాప్‌ల వినియోగంతో తమ వ్యవసాయ ఉత్పత్తులను ఎటువంటి దళారి వ్యవస్థ లేకుండా నేరుగా కొనుగోలు దారులకు అమ్మవచ్చు. ఇవన్నీ స్మార్ట్ ఫోన్ ద్వారానే చేయవచ్చు. రైతులు పండించిన పంటకు లాభసాటి ధర వచ్చేలా ఎప్పటికప్పుడు మార్కెట్ ధరల వివరాలు తెలుసుకొని అందుకనుగుణంగా తమ పంటను విక్రయించుకునేందుకు రైతులకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో తోడ్పడుతుంది.

ప్రజాశక్తి: జిల్లాలో సాగు విస్తీర్ణం ఎంత..?

జెడి: జిల్లాలో మొత్తం 3,26,788 ఎకరాలు సాగులో ఉండగా అందులో 1,69,560 ఎకరాలు వ్యవసాయ సాగులో ఉంది. ఉద్యానవన పంటల సాగు1,45,335 ఎకరాలు, పట్టు పరిశ్రమ సాగు 11,892 ఎకరాల్లో ఉంది. జిల్లా వ్యాప్తంగా 1,57,575 మంది రైతులు ఉన్నారు. జిల్లాలో 502 రైతు సేవా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి.

ప్రజాశక్తి: రైతులకు స్మార్ట్ ఫోన్, యాప్‌ల వాడకంపై అవగాహన కల్పిస్తున్నారు..?

జెడి: స్మార్ట్ ఫోన్‌ను ఎలా ఉపయోగించాలి, యూపీఐ యాప్‌ల ద్వారా డబ్బులు పంపడం, తీసుకోవడం, మార్కెట్ ధరలు, వాతావరణం, పంటల వివరాలు వంటి సమాచారం అందించే వ్యవసాయ యాప్‌లను వాడకం, యూట్యూబ్‌ను వ్యవసాయం సంబంధిత విషయాలు తెలుసుకోవటానికి ఉపయోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. అలాగే ప్రభుత్వ విధానాల గురించి పూర్తి సమాచారం పొందడంపై పూర్తి పరిజ్ఞానాన్ని పొందడం. సాంకేతికత వ్యవసాయ రంగంలోకి అడుగు పెట్టిన రోజు నుండి, ఆన్లైన్లో విత్తనాలు కొనడం నుండి డ్రోన్ సహాయంతో పొలమంతా ఎరువులు వేయడం వరకు అనేక రకాల మార్పులను చూశాము. వ్యవసాయం కోసం మొబైల్ యాప్‌లో అనేక రకాల ఫీచర్లు ఉన్నాయి. వాటిలో ఒకటి ఈ-షాపింగ్‌గా మారింది. స్మార్ట్‌ఫోన్ల వాడకం, యాప్‌ల ద్వారా విషయాలను ఎలా తెలుసుకోవాలనే అంశంపై అవగాహన కల్పించడం జరిగింది.

సన్ షైన్ అవార్డుకు ఎంపికైన శ్రావంతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్, రొంపిచెర్ల: రొంపిచర్ల మండలంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని బిఆర్.శ్రావంతి సన్‌షైన్ స్టార్ అవార్డ్‌కి ఎంపికైన సందర్భంగా గౌరవ చిత్తూరు జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మద్దిపట్ల వెంకట్రమణ, ఇతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు. శ్రావంతి రొంపిచర్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతూ ఆంధ్రప్రదేశ్ కెజిబివి పాఠశాలలలో అత్యున్నత ప్రతిభ కనబరిచి 935 మార్కులు సాధించినందుకు ఈ అవార్డుకు ఎంపికైంది. ఈ గర్వకారణమైన విజయాన్ని గుర్తించి, వారి ప్రతిభకు గుర్తింపుగా ఈనెల 15వ తేదీ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా సన్షైన్ స్టార్ అవార్డు అందుకోనున్నారు.

తాగునీటి కుళాయిల్లో రంగునీరు

ప్రజాశక్తి - విజయపురం (నగరి):

మున్సిపల్ పరిధి కీళపట్టు పెరుమాళ్‌నగర్‌లో తాగునీటి కుళాయిలో రంగునీరు రావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. బోరులోని నీరు తాగడానికి అనువైంది కాకపోవడంతో స్థానికులు మున్సిపాలిటీ వారు పంపిణీ చేసే నీటిపైనే ఆధారపడతారు. ఆ నీరు కూడా రంగుగా రావడంతో జనం విస్తుపోయారు. ఇలా వచ్చేనీరు తాము ఎలా వాడుకోవాలంటూ జనం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజు వాటర్ ప్లాంట్ నుంచి నీరు తెచ్చుకోలేకే మున్సిపల్ నీరు వాడుకుంటున్నామని ఇలా రంగుగా వచ్చే నీరు ఏలా వాడాలంటూ ప్రశ్నించారు. శుభ్రమైన నీరు అందించేందుకు అధికారుల చర్యలు చేపట్టాలన్నారు.

సిగ్గు.. సిగ్గు

నేడు అంబేద్కరుడి 135వ జయంతి

వివక్ష.. అంటరానితనం.. అణచివేత ఇంకానా..?

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

సంపద సృష్టికి, సమాజాభివృద్ధికి తరతరాల నుండి శ్రమను ధారపోస్తున్న దళితులు, గిరిజనులు నేటికీ అమానుషమైన అంటరానితనం, కుల వివక్ష, అత్యాచారాలు, అణిచి వేతలకు, సాంఘిక బహిష్కరణలకు గురవుతున్నారు. భూమి, నీరు, సంపద, బడ్జెట్, అభివృద్ధిలో వాటా దక్కక, కేటాయింపులూ లేక, చేసినవీ అందక పేదలుగానే వున్నారు. అంతిమంగా పాలకులు ఆడే రాజకీయ చదరంగంలో సమిధలవుతున్నారు. విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి అందని ద్రాక్షలా మారింది. అణగారిన వర్గాల సామాజిక, ఆర్థిక సమానత్వ సాధనకై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అలుపెరగని పోరాటం చేశారు. నిమ్న జాతుల అభివృద్ధి, సాధికారత కోసం ఏకంగా రాజ్యాంగాన్నే రచించారు. అయితే ఆ రాజ్యాంగ ఫలాలు నేడు దళితులు, గిరిజనులు అనిభవిస్తున్నారా..? అంటే లేదనే చెప్పాలి. జనవరి 26న రాజ్యాంగ దినోత్సవాన్ని, ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించడం తప్పా ఒరిగిందేమీ లేదు. వివక్ష.. అంటరానితనం.. అణచివేత.. మూడు విడదీయరాని బంధంలా వేటికవే సమాజంలో నేటికీ వేన్నూళ్ళిపోయాయి. అయినా మనం నేడు అంబేద్కర్ జయంతిని నిర్వహించుకుంటున్నాం. అంబేద్కర్ అమర్ రహే అంటూ ఆయన ఆదర్శాలను చంపేస్తున్నాం. మనువాద ముసుగు వేసుకున్న కొందరు అగ్ర పాలకులు ఇందుకు ముఖ్య కారణమని చెప్పకుండా ఉండలేం.

అభివృద్ధికి ఆమడదూరంలో దళితులు

స్వాతంత్రం సిద్ధించి 78 ఏళ్ళు, గణతంత్రం సిద్ధించి 76 ఏళ్ళు గడుస్తున్నా దళితులు ఇంకా అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నారు. దళితవాడల్లో సరైన మౌలిక వసతులు లేవు. పక్కా గృహాలూ కరువే. తిరుపతి జిల్లాలోని తూర్పు మండలాల్లోని దళిత వాడలను, అగ్రకుల నివాసాలను ఓ సారి పరికించి చూస్తే తేడా కొట్టుకొచ్చినట్లు కనిపిస్తుంది. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులంటూ బడ్జెట్ లో అర కొర కేటాయింపులు చేస్తున్నా, పాలకులు వాటినీ దారి మళ్ళించేస్తున్న పరిస్థితి. దళిత వాడల్లో సరైన మురుగు నీటి వ్యవస్థ లేక మురికి కూపాల్లో మగ్గుతున్న వైనం. సచ్చాకైనా వీటన్నింటికీ దూరంగా ఉండాలంటే శ్మశానాలు లేక, ఉన్నా దారి లేక అంతిమ యాత్రలు నరకంగా మారుతున్నాయి.

అంటరానితనం.. అణచివేత

భారతీయ సమాజాన్ని కసిగా కాటేస్తున్న కులం అనే కాలకూట సర్పానికి పాలు పోసి పెంచుతోంది పాలకులే. ఇదంతా ఎవరైనా మాట్లాడితే ఆ..ఈ కాలంలో ఇంకా కులం ఎక్కడ ఉందండీ అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతుంటారు. అయితే వాస్తవ పరిస్థితుల్లోకెళితే కులం.. అంటరానితనం.. అగ్ర దాడులు వివిధ రూపాల్లో దళితులను, గిరిజనులను అణిచివేస్తూనే ఉన్నాయి. వీటికి సాక్షాలుగా నిలిచే పలు ఉదంతాలు గడిచిన ఐదేళ్లలో తూర్పు మండలాల్లో చాలానే జరిగాయి. చేపలు ఇవ్వనన్నందుకు ఓ గిరిజన బాలుడిని ఓ అగ్ర కులస్తుడు దారుణంగా హత్య చేసి ఇసుకలో పూడ్చిపెట్టిన విషాద ఘటన బుచ్చినాయుడుకండ్రిగ మండలం, పల్లమాలలో ఇదేళ్ల కిందట చోటుచేసుకుంది. ఓ యాదవ అమ్మాయిని కులాంతర వివాహం చేసుకున్నందుకు ఓ దళిత కుటుంబంపై ఊరు ఊరంతా కలిసి దాడి చేసిన ఘటన నాలుగేళ్ల కిందట ఏర్పేడులో చోటుచేసుకుంది. కులాంతర వివాహం చేసుకున్నందుకు దళితులను గ్రామ బహిష్కరణ చేసిన ఘటన కేవీబీ పురం మండలం అంజురుపాలెంలో ఏడాది కిందట చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనాన్ని నెమ్మదిగా నడపమన్నందుకు ఆగ్రహించిన అగ్రకులస్తులు గిరిజనులపై మూకుమ్మడిగా దాడి చేసిన ఘటన రెండు రోజుల కిందట తొట్టంబేడు మండలం విరూపాక్షపురంలో చోటుచేసుకుంది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ఉదంతాలే ఉన్నాయి. వీటన్నిటినీ దాటి దళితులు, గిరిజనులు సామాజిక, ఆర్థిక సమానత్వం సాధిస్తేనే అంబేద్కరుడికి మనమిచ్చే అసలైన నివాళి. ఆ దిశగా పాలక ప్రభుత్వాలు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మూత 'బడి'పై పోరు

- మోడల్ పేరుతో విలీనం
- ఎంఇఓల ద్వారా టీచర్లపై ఒత్తిళ్లు
- ప్రభుత్వ చర్యలు వ్యతిరేకిస్తూ నేడు నిరసన ప్రదర్శన, ర్యాలీ



ప్రజాశక్తి - తిరుపతి:

మోడల్ స్కూల్స్ పేరుతో ప్రభుత్వ బడుల విలీనమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రణాళికలను అమలు చేస్తోంది. పేద విద్యార్థులకు ప్రాథమిక విద్యను దూరం చేసేలా కుట్రలు పన్నుతోంది. ఐదు కిలోమీటర్ల పరిధిలోని స్కూలు మాత్రమే విలీనం చేస్తామని చెప్పిన సర్కారు... మండల విద్యాశాఖ అధికారుల ద్వారా 7 కిలోమీటర్ల పరిధికి పెంచాలని టీచర్లపై ఒత్తిడి చేస్తోంది. జిల్లా కలెక్టర్ ద్వారా నేరుగా మండల స్థాయి విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ దుందుడుకు చర్యల్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు భారీ నిరసన ప్రదర్శన ర్యాలీని నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి ప్రభుత్వ వ్యవహార శైలిపై తమ నిరసనను వ్యక్తం చేసేందుకు సిద్ధమవడం గమనార్హం.

మోడల్ పేరుతో కుట్ర

ప్రభుత్వం తమ ప్రచార ఆర్భాటంలో భాగంగా మోడల్ స్కూలను తెరపైకి తీసుకొచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు ప్రభుత్వ ప్రాథమిక విద్యను దూరం చేసేందుకు కుట్ర పన్నుతోంది. ప్రతి పంచాయతీలోనూ మోడల్ స్కూల్లో ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగా ఐదు కిలోమీటర్ల పరిధిలోని స్కూలు మాత్రమే విలీనం చేస్తున్నామని ప్రభుత్వం తొలుతగా ప్రకటించింది. ఆ తర్వాత ఆ పరిధిని ఏడు కిలోమీటర్లకు పెంచాలని ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి చేస్తోంది. ఈ మేరకు తమకేమీ అభ్యంతరం లేదంటూ స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలపై తీవ్ర ఒత్తిడి చేసి తీర్మానాలను చేయిస్తోంది. ఇలా దాదాపు 900 స్కూళ్లను మూసి వేసే దిశగా ప్రభుత్వం ఇటు అధికారులు సన్నద్ధమవడం గమనార్హం.

నేడు నిరసన ప్రదర్శన, ర్యాలీ

రాష్ట్రంలో విద్యారంగంపై ప్రభుత్వం సాగిస్తున్న దాడి, పాఠశాలల రద్దును వ్యతిరేకిస్తూ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నేడు భారీ నిరసన ప్రదర్శన, ర్యాలీ నిర్వహించనున్నారు. ఏప్రిల్ 14వ తేదీ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సాయంత్రం నాలుగు గంటలకు తిరుపతి ఇందిరా మైదానం నుంచి నాలుగు కాళ్ల మంటపం, రైల్వే స్టేషన్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వరకు ప్రజాప్రదర్శనను నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇవ్వనున్నారు.

ప్రతిభాపురస్కారం, సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయులు

టీచర్లకు ఘన సన్మానం

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: అన్నమయ్య జిల్లా రాయచోటి కి చెందిన సోమరాజు ఫౌండేషన్ ఆధ్వర్యం లో మండ లంలోని పెద్ద కాలువ గ్రామ సమీపంలోని సుందర రాజుపురం సమీపంలో విజయం స్కూల్లో మండలానికి చెందిన 13 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు సన్మానం చేసి ప్రశంసా పత్రాలు అందించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి, జ్యోతిరావు పూలే జయంతిలను పురస్కరించుకుని ఈ సన్మానం నిర్వహించారు. సన్మానం అందుకున్న వారిలో ఉపాధ్యాయులు చెన్నకేశవరెడ్డి, గంగాధరం, కోటి, శాంతి ,కమలాపతి నాయుడు, విజయ్ కుమార్, రాజేంద్రన్, కార్తికేయ రెడ్డి, దినకర్, ఢిల్లీ ప్రకాష్, గంగాధరం, నాగరాజు నాయుడు, పురుషోత్తం ఉన్నారు.



ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం పంచాయతీ పరిధిలో ప్రజల సౌకర్యార్థం ఆ పంచాయతీ టిడిపి అధ్యక్షులు జి గోవిందస్వామి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తిరుపతి శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో అనారోగ్యంతో ఉన్న వారు 87 మంది హాజరు కాగా డాక్టర్ రఘు వారిని పరిశీలించి శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తిరుపతి వారిచే ఉచిత మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్ అవసరమైన వారికి టిడిపి పంచాయతీ అధ్యక్షులు గోవిందస్వామి సహకారంతో తిరుపతి హాస్పిటల్ కి వెళ్లేందుకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. వారికి ఎన్టీఆర్ ఆరోగ్య సేవ ద్వారా ఉచితంగా ఆపరేషన్ నిర్వహించి ఇంటికి చేర్చేవరకు బాధ్యత తీసుకున్నట్లు గోవిందు స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రఘు, మేనేజర్ పురంధర్ సిస్టర్లు మీనా, మణెమ్మ, రాజేశ్వరి తీర్థం టిడిపి సభ్యులు, మండలంలోని అనారోగ్యంతో ఉన్న ప్రజలు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి వేడుకలకు స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యేలు

అంబేద్కర్ జయంతి వేడుకలకు స్థల పరిశీలన

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతల పట్టు మండల కేంద్రంలో సోమవారం అట్టహాసంగా నిర్వహించనున్న అంబేద్కర్ జయంతి వేడుకల్లో భాగంగా ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం పూతలపట్టు ఎమ్మెల్యే మురళి మోహన్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిలు పరిశీలించారు. నియోజకవర్గం నుంచి సుమారు 10,000 మంది జయంతి వేడుకలకు హాజరుకానున్నట్టు పూతలపట్టు ఎమ్మెల్యే తెలిపారు. జిల్లా నుంచి టిడిపి అధినాయకులు కార్యక్రమానికి విచ్చేయనున్నట్టు వివరించారు.

నేడు అంబేద్కర్ జయంతి వేడుకలు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండల కేంద్రంలో టిడిపి ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు సోమవారం ఉదయం 10 గంటలకు జరుగుతాయని టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు వరప్రసాద్ మీడియాకు తెలిపారు. ఆదివారం మీడియాకు తెలిపిన వివరాలు.. గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే , రాష్ట్ర ప్రభుత్వ విప్ డావిఎం థామస్ ఆదేశాల మేరకు అంబేద్కర్ జయంతి వేడుకలు జరపాలని పార్టీ శ్రేణులకు తెలిపారు. మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలు జరుగుతాయని అందరూ హాజరు కావాలని కోరారు.

అంబేద్కర్ విగ్రహానికి విద్యుత్ దీపాలంకరణ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బంగారుపాలెం మండలం మొగిలి వెంకటగిరి జాతీయ రహదారి పక్కనే వున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. రహదారి గుండా వెళ్లే వారు అంబేద్కర్ స్మరించుకుంటూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ న స్మరించుకోవడం భారతీయుల బాధ్యత అన్నారు.

జనసేన నాయకులను సన్మానిస్తున్న కార్యకర్తలు

పార్టీ బలోపేతానికి పనిచేయాలి

జనసేన జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: జనసేన బలోపేతానికి పనిచేయాలని జిల్లా జనసేన అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని తుంబ కుప్పం తుంబపాలెం కచ్చేటివారి పల్లి గ్రామాల్లో జనసేన జెండా ఆవిష్కరణ మండల అధ్యక్షులు కోడి చంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ ,తిరుపతి శాసన సభ్యులు ఆరని శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త పనిచేయాలని పార్టీ స్థాపించిన తర్వాత అధికారం చేపట్టామని ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం జండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శివరాజ్, మహేష్, బుస రాజేంద్ర పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతిమ సంస్కారాలకూ అవస్థలే!

- కమ్ముకున్న ముళ్లపొదలు
- నడిచి వెళ్లడానికి కానరాని దారి
- పాడె మోసేవారికి తప్పని కష్టాలు
- స్పందించని అధికారులు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: ప్రతి వ్యక్తి జీవితంలో మజిలీ శ్మశానానికే.. అక్కడ కనీస వసతులు కరువై అంతిమ సంస్కారాలకూ కష్టాలు తప్పడం లేదు. గంగాధర నెల్లూరు నియోజకవర్గం కొమరగుంట పంచాయతీలో ఈ సమస్య అధికంగా వుంది. శ్మశాన వాటిక అభివృద్ధి, వసతుల కల్పనపై అటు ప్రభుత్వాలు, ఇటు అధికారులు స్పందించడంలేదు. ఇప్పటి టిడిపి ప్రభుత్వం శ్మశానాల అభివృద్ధి, వసతుల కల్పనపై దృష్టి పెట్టినా కొమరగుంట పంచాయతీ శ్మశానం మాత్రం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. దీంతో నడిచి వెళ్లడానికి దారి లేక పాడె మోసుకెళ్లేవారి పాదాలకు ముళ్ల కంపలు గుచ్చుకుని గాయాలపాలు కావాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పాలకులు, ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాల్సిన అవసరం వుంది.

ఆందోళనకరంగా వున్నాయని స్థానికులు వాపోతున్నారు.

కమ్ముకున్న ముళ్లపొదలు

గంగాధర నెల్లూరు నియోజక వర్గం పరిధిలో కొమరగుంట గ్రామం వుంది. ఇక్కడ సుమారు 150 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. ఆ గ్రామానికి రోడ్డుకు ఆనుకొని సుమారు ఒక ఎకర శ్మశాన స్థలం వుంది. ఎవరైనా చనిపోతే ఖననం చేసేందుకు గత ప్రభుత్వం శ్మశాన వాటిక, బంధువులు దుస్తులు మార్చుకునేందుకు స్త్రీ, పురుషులకు విడివిడిగా గదులు నిర్మించారు. ఆ గ్రామంలో ఎవరైనా వ్యక్తి చనిపోతే ఇక్కడ ఖననం చేయాలంటే బంధువులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆ ముళ్ల పొదలు తొలగించకలే నానా రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పొదల మాటున ఉన్న శ్మశాన వాటిక

పాడె మోసేవారికి తప్పని కష్టాలు

మృతదేహాన్ని మోసుకువెళ్లే నలుగురు వ్యక్తుల కాళ్లకు ముళ్లు గుచ్చుకుని గాయాలపాలు కావాల్సి వస్తోందని స్థానికు లు చెబుతున్నారు. మృతదేహాన్ని పాతి పెట్టేటందుకు గొయ్యి తీయాలన్నా పెద్ద పెద్ద మొక్కలు పెరిగిపోయి ఉన్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. స్త్రీ , పురుషులకు విడివిడిగా నిర్మించిన గదులు చుట్టూ ముళ్ల పొదలు కమ్ముకుని లోపల ఏమి ఉన్నాయో కూడా కనిపించని స్థితిలో

స్పందించని అధికారులు

అధ్వాన్నంగా ఉన్న శ్మశాన వాటికను అటు ప్రభుత్వం, ఇటు అధికారు లు స్పందించి శ్మశానంలో ముళ్ల పొదల తొలగించి దారి సమస్య పరిష్కరించాల ని గ్రామస్తులు కోరుతున్నారు.

స్నానపు గది చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

బహుమతుల పంపిణీ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండ లంలోని వేపంజేరిలో ఆదివారం నిర్వహించిన మెగా వాలీబాల్ టోర్నమెంటులో మొదటి బహుమతి 50 వేల రూపాయలు గెలుచుకున్న కార్వేటినగరం టీంకు, రెండవ బహుమతి గెలుచుకున్న కొత్తపల్లి టీం రూ.25 వేలు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వేపంజేరి ముసలయ్య గారి పల్లికి చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ మనోహర్ రెడ్డి యువకులను ప్రోత్సహించేందుకు తన సొంత నిధులను ఖర్చుపెట్టి గ్రామ స్థాయి యువకులను ఉత్సాహపరుస్తున్నారు. ఈ నేపథ్యంలో తన స్వగ్రామంలో మెగా వాలీబాల్ టోర్నమెంటు నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో 21 టీంలు పాల్గొనగా అందులో మొదటి బహుమతి కార్వేటినగరం టీం, రెండవ బహుమతి కొత్తపల్లి టీం కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో చదువుతో పాటు క్రీడల్లోనూ పోటీ తత్వం పెరుగుతుందని దాని ద్వారా గ్రామస్థాయి నుంచి యువకులను వారి వారి పరిజ్ఞానాన్ని ఈ క్రీడల ద్వారా వెలికి తీయవచ్చన్నారు. ఈ కారణంగా యువకులను ప్రోత్సహించేందుకు ఇలాంటి క్రీడలకు తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు వచ్చానని తెలిపారు. ఈ వాలీబాల్ టోర్నమెంట్లో జానకి రామ్, జయచంద్ర ఆర్గనైజర్గా వ్యవహరించారు. వీరితో పాటు గ్రామ యువ నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న యువకులు

మాజీ సర్పంచ్ తండ్రి మృతి

చిన్నమరెడ్డి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని పెరుమాలపల్లి పంచాయతీ మండల మాజీ సర్పంచ్ బొడిరెడ్డి హనుమంతు రెడ్డి తండ్రి బోడిరెడ్డి చిన్నమరెడ్డి (78) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. సోమవారం మధ్యాహ్నం ఒక గంటకు పేరుమలపల్లి గ్రామంలో దహన క్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

రీ సర్వే పనులు పరిశీలిస్తున్న తహశీల్దారు పి కిరణ్‌కుమార్

రీ సర్వే పరిశీలన

ప్రజాశక్తి -రొంపిచర్ల: రొంపిచర్ల మండలం బండ కింద పల్లిలో ఆదివారం నిర్వహిస్తున్న భూ రీ సర్వే పనులను రొంపిచర్ల తహశీల్దారు పి కిరణ్ కుమార్ ఆదివారం పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ భూ సర్వేలను రైతుల సమక్షంలో పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌డిటి లోకేష్, బండి కింద పల్లి గ్రామ వీఆర్వో సురేంద్ర, సర్వేయర్ మానస, వీఆర్ఏ ఎస్ ఇర్ఫాన్ అలీ, రైతులు పాల్గొన్నారు.



పాలు, పండ్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

పాలు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బంగారుపాలెం మండలం టిడిపి నాయకుడు మండల క్లస్టర్ ఇంచార్జ్ యన్ పి. ధరణి ప్రసాద్ నాయుడు జన్మదిన వేడుకలు పురస్కరించుకొని ఆదివారం ఆయన అభిమానులు కేక్ కట్ చేసి అభిమానులు పంచిపెట్టి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పాలు పండ్లు రొట్టెలను వైద్య అధికారి డాక్టర్ విజయ కుమారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనార్దన్ గౌడ్, బీసీ రవీంద్ర నాయుడు, లోకనాథ నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిన్నయ్య, గిరిబాబు, ఎంపీటీసీ విజయ్ కుమార్, నల్లగాంపల్లి శివ, కృష్ణమూర్తి, శివాజీ, రాజశేఖర్, రామయ్య పాల్గొన్నారు.

వైభవంగా సిలువ యాత్ర



ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ఎస్ఆర్ పురం మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49. కొత్తపల్లి మిట్ట సిఎస్ఐ చర్చి సంఘం ఆధ్వర్యంలో కొత్తపల్లి మిట్ట గ్రామంలో ఏసుక్రీస్తు వేషధారణతో క్రైస్తవ భక్తులు సిలువ యాత్రను ఏరియా చెైర్మెన్ రెవ్. జాన్ సాలుమోన్, చైర్మన్ రెవ్. మ్యాథ్యూ , కొత్తపల్లి సంఘ కాపరి రెవ్. అన్బు దాస్ కలిసి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ అన్బుదాస్ మాట్లాడుతూ.... క్రైస్తవ భక్తులు 40 రోజులు ఉపవాసాలు, శ్రమ దినాలు అనంతరం సిలువ యాత్రను 12 చర్చిల సంఘాలు కొత్తపల్లి మిట్టలో సిలువ యాత్రను ప్రారంభించి చిన్న తయ్యూరు కలవర కొండ వరకు సిలువ యాత్ర సాగుతుందని పాస్టర్ అనుబుదాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 12 చర్చిల క్రైస్తవ భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన నిఖిత్‌కు ఎంపీ అభినందనలు

నిఖిత్‌ను అభినందిస్తున్న ఎంపి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో మొదటి ర్యాంకు సాధించడంతో పాటు, చిత్తూరు పార్లమెంటు పరిధిలో ద్వితీయ ర్యాంకు కైవసం చేసుకున్న గంగాధర నెల్లూరు నియోజకవర్గం, జీడి నెల్లూరు మండలం, గారం పల్లె గ్రామానికి చెందిన విద్యార్థి ఏ నిఖిత్‌ను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ఆదివారం అభినందిం చారు. పట్టు దల, కృషి, క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి 989 మార్కు లను సాధించిన నిఖిత్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన కాంక్షిం చారు. అతని తల్లిదండ్రులను, విద్యా బుద్ధులు చెప్పిన అధ్యాపకులను ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అభినం దించారు.

గంగాధర నెల్లూరు: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో గంగాధర నెల్లూరు మండల గారంపల్లి గ్రామానికి చెందిన శ్యామల భాస్కర్ నాయుడు కుమారుడు నికిత్ విజయకేతనం ఎగురవేశారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ విద్యను అభ్యసించిన నిఖిత్ ఎంపీసీలో వెయ్యికి 989 మార్కుల సాధించి గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో మొదటి స్థానంలో, చిత్తూరు పార్లమెంటు పరిధిలో రెండవ ర్యాంకుతో విజయ కేతనం మోగించారు. సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన నిఖిత్ కృషి పట్టుదలతో మంచి మార్కులు సాధించడంతో తల్లిదండ్రులను, విద్యార్థి నిఖిత్ ను ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, జీడి నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్, గ్రామస్తులు పలువురు ప్రజా ప్రతినిధులు అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు: డిఎస్‌పి

ట్రాఫిక్ నిబంధనలపై డిఎస్‌పి, సిఐలు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -విజయపురం (నగరి): రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా నగరి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక చర్యలు తీసు కుంటున్నామని, నగరి పట్టణంలో ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణాలు, సెల్ ఫోన్ డ్రైవింగ్ ఎక్కువగా ఉన్న దృష్ట్యా వాహన దారులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా నగరి పట్టణంలో అన్ని రోడ్‌లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని డిఎస్‌పి సయ్యద్ మహ్మద్ అజీజ్, సిఐ విక్రమ్ పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ కీళపట్టు, తెరని క్రాస్ వద్ద బారికేడులను అమర్చారు. త్వరలో మరిన్ని చర్యలు తీసుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీక రించడంతో పాటు, రోడ్ ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నారు. వాహన దారులు రోడ్ భద్రత నియమాలు పాటించి ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకుని పోలీసులకు సహకరించాలని కోరారు.

బొమ్మ సముద్రం జూనియర్ కళాశాల వంద శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: బొమ్మ సముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో 50 మంది విద్యార్థులకు 50 మంది అత్యున్నత మార్కులతో ఉత్తీర్ణత సాధించి నూటికి నూరు శాతం ఫలితాలు సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ శరశ్చంద్రశేఖర్ తెలిపారు. మొదటి సంవత్సరం ఫలితాలలో 85 శాతం ఫలితాలు సాధించా రని 62 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని ఆర్ దివ్య 940 మార్కులు , సీఈసీలో వి కోకిల 660, ఎంఅండ్‌ఏటిలో కె రాఘవేంద్ర 889 మార్కులు పొంది కళాశాల టాపర్ విద్యార్థులుగా నిలిచారని తెలిపారు . బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలో గత మూడు సంవత్సరాలుగా నూటికి నూరు శాతం ఫలితాలు సాధిస్తున్నామని , అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థు లకు కళాశాల ప్రిన్సిపల్ శుభాకాంక్షలు తెలుపు తూ ప్రస్తుతం పదవ తరగతి పరీక్ష రాసిన విద్యార్థులు వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాల బొమ్మ సముద్రంలో అడ్మిషన్లు పొందాలని కళాశాలలో ఎంపీసీ , బైపిసి, సిఇసి, హెచ్ఇసి, ఎంఈటి కోర్సులు అందుబాటు లో ఉన్నాయని విద్యార్థులకు ప్రోత్సాహం కోసం తల్లికి వందనం పథకం ద్వారా సంవత్సరానికి 15 వేల రూపాయలు ఉచిత నోట్ పుస్తకాలు పాఠ్యపుస్తకాలు, ఉచిత మధ్యాహ్నం భోజనం అందిస్తామని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు నీట్, ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్‌లకు ప్రత్యేక కోచింగ్ ఇస్తామని కావున తల్లిదండ్రులు, విద్యార్థులు వెంటనే అడ్మిషన్లు పొంది నాణ్యమైన విద్యను పొందాలని ఆ కళాశాల ప్రిన్సిపల్ బి శరశ్చంద్రశేఖర్ కోరారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శరశ్చంద్రశేఖర్

గంజాయి నిర్మూలనకు కఠిన చర్యలు: సిఐ

ప్రజాశక్తి -విజయపురం (నగరి): నగరి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకు న్నామని, అందులో భాగంగా ప్రధానంగా ఒరిస్సా, చుట్టు పక్కల ప్రదేశాల నుండి గంజాయి తీసుకొచ్చి సప్లై చేసే వారిని, అమ్మే వారిని గుర్తించామని, ఇప్పటికే ఓజీ కుప్పంకి చెందిన ప్రధానంగా గంజాయి సప్లై చేసే హరికృష్ణ, దొర్రై, ముత్యాల కుమార్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామని సిఐ విక్రమ్ పేర్కొన్నారు. సిఐ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గంజాయి రవాణా, వ్యాపారం చేస్తూ సుమారు ఆరు నెలల పాటు తప్పించుకొని తిరుగుతున్న ఓజీ కుప్పంకి చెందిన 29 సంవత్సరాలు కలిగిన షణ్ముగం తండ్రి సుబ్రహ్మణ్యం అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, విచారించి తగు వివరాలు తీసుకున్నామని తెలిపారు. నిందితులకు మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారన్నారు. ఈ సందర్భంగా నగరి, రూరల్ పరిధిలో గంజాయి తాగడం, అమ్మడం, రవా ణా చేయడం, గంజాయి కలిగి ఉండటం గురించి సమా చారం తెలిసిన వారు తమకు తెలిపి గంజాయి నిర్మూలనకు పోలీసులకు సహకరించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. విక్రమ్, సిఐ , నగరి 9440796723 నెంబరుకు సమాచా రం ఇవ్వాలని సూచించారు.

గంజాయి వ్యాపారం చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: 2006 −2007వ సంవత్సరంపదో తరగతి విద్యార్థులు ఆదివారం సునీల్ కృష్ణకుమార్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో అప్పటి ప్రధాన ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తీర్థంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు కండువా కప్పి పూలమాలవేసి ఘన స్వాగతం పలికి ఆహ్వానించారు. అనంతరం పూర్వ విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మాట్లాడుతూ గతంలో తాము మీకు విద్య నేర్పినప్పుడు కష్టం అనిపిస్తూ ఉంటుంది.. కానీ మీరు బాగాఅభివృద్ధి చెందితేనే వాటి విలువ తెలుస్తుందన్నారు. అప్పట్లో మీరు బాధపడినా కొద్ది రోజులకు ఇప్పుడు ప్రయోజకులు కావడంతో సంతోషిస్తున్నామన్నారు. ఈ ఆత్మీయ సమావేశానికి తాము రావడం చాలా సంతోషకరమన్నారు. అంతే కాకుండా ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులను గౌరవిస్తూ వారిని బాగా చూసుకోవాలన్నారు. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు విందు భోజనం నిర్వహించి విద్యార్థులు విద్యార్థులు కలిసి భోంచేశారు. అనంతరం కాసేపు పూర్వపు తీపి గుర్తులను నెమరు వేసు కుంటూ సంతోషంతో ప్రస్తుతం వారు చేస్తున్న వృత్తులు ఒకరికొకరు ఫ్యామిలీలు గురించి మాట్లాడు కుంటూ సంతోషాలతో కేరింతలతో పాటల కచేరీలతో పోటీ పడుతూ సంతోషం వ్యక్తం చేసుకుంటూ గడిపారు సాయంత్రం ప్రతి ఒక్కరికి వీడ్కోలు పలుకుతూ వారు స్వగ్రామాలకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వపు ప్రధాన ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, హిందీ టీచర్ బాలాజీ , చంద్రశేఖర్ గుప్తా, తెలుగు టీచర్ పెనువేలు సింహ, జి శ్రీలత, ఇంగ్లీష్ టీచర్ ఎం వెంకటరత్నం, హిందీ టీచర్ పార్థసారథి, 2006−2007సంవత్సరపు టెన్త్ క్లాస్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలం కమ్మనపల్లి పంచాయతీకి చెందిన ఇల్లూరు సమీపంలో ఇన్నోవా కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఇల్లూరుకు చెందిన జైపాల్ బైరెడ్డిపల్లి మండల కేంద్రంలో తన సొంత పనిని ముగించుకొని స్వగ్రామానికి రాత్రి ఏడు గంటల సమయంలో బయలుదేరాడు. జాలారిపల్లి సమీపంలోని ప్రమాదకర డ్యామ్ సమీపంలో ఇతని ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని ఇన్నోవా కారు ఢీకొంది. క్షతగాత్రుడు జైపాల్‌కు తలకు, శరీరానికి గాయాలైనట్లు తెలుస్తోంది. క్షతగాత్రుడిని రాణిపేట సిఎంసి కి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

స్పందించని అధికారులు

గతంలో ఈ మలుపు వద్ద డ్యామ్ పగిలిపోయిన కథనాన్ని' అధికారులకు తెలిపినా పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితంగానే యాక్సిడెంట్ జోన్లో ప్రమాదాలు జోరుగా పెరుగుతున్నాయని సంబంధిత శాఖ వారు దీన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఇదే క్రమంలో కారు గుంతను తప్పించబోయి ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఈ డ్యాం వద్ద గుంతను సంబంధిత శాఖ మరమ్మతులు నిర్వహించి ప్రయాణికులకు అంతరాయం కలగకుండా చూడాలని బాటసారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ పెట్రోల్ బంక్ వద్ద స్కూటరుపై ప్రయాణిస్తు న్న వ్యక్తిని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటరిస్టు తీవ్ర గాయాలై ఆసుపత్రి పాలైన సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని ఆగరమంగళం గ్రామానికి చెందిన ప్రకాష్ (27) గంగాధర నెల్లూరు ఎస్సీ కాలనీ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు వెళుతుండగా అదే సమయానికి పుత్తూరు నుంచి చిత్తూరుకు వస్తున్న కారు మోటార్ సైకిలిస్ట్‌ను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో మోటార్ సైకిల్ పై వెళుతున్న ప్రకాష్ తలకు తీవ్రగాయాలు అయ్యాయి. అతనిని వెంటనే చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకుని పోలీసులు వివరాలు సేకరించారు . కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- శాంతిపురం: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని మఠం గ్రామం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో సుమారు 60−70 మధ్య వయస్సు కలిగిన వ్యక్తితీవ్రంగా గాయపడ్డాడని, పిఇఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. వ్యక్తి వివరాలు తెలియని కారణంగా ఆయన గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్నట్లు రాలు బూదులు పోలీసులు తెలిపారు. ఆయన్ను గుర్తించగలిగే వారు లేదా సంబంధిత సమాచారం తెలిసినవారు రాళ్లబూదుగూరు పోలీసులకు, 9440900734 నంబరుకు తెలపాలని ఎస్ఐ నరేష్ తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండవపట్టణ పరిధిలోని అడివయ్యకాలనీలో గల గాడ్ గ్రేస్ సొసైటీ వృద్ధాశ్రమంలో ఆదివారం శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు భాషాజాన్ పాల్ , రఫీ, మహిమ గ్లోరీ తదితరులు పాల్గొన్నారు.

శిశు సంక్షేమ శాఖలో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖలో ఒప్పంద ప్రతిపాదికన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఎంపిక సంఘం అధ్యక్షులు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర ఓ ప్రకటనలో తెలిపారు. మిషన్ వాత్సల్య స్కీము లో తిరుపతి జిల్లాలో ఖాళీగా ఉన్న కౌన్సిలర్, సోషల్ వర్కర్, డేటా అనలిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇతర పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను కోరుతున్నామన్నారు. విద్యార్హతలు వెబ్సైట్ లో పరిశీలించుకోవాలని, ప్రారంభ జీతం రూ.7944/− నుండి రూ.18,536/− (పోస్ట్ ఎంపికబట్టి) దరఖాస్తులను పోస్టు ద్వారా, లేదా నేరుగా కార్యాలయంలో సమర్పించడానికి ఈనెల 15 నుండి 30వ తారీకు సాయంత్రం ఐదున్నర గంటలలోపు సమర్పించాలన్నారు. వివరాలకు అభ్యర్థులు జిల్లా కలెక్టరేట్లోని బి బ్లాకులో ఉన్న జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత వారి కార్యాలయంలో సందర్శించాలన్నారు.



సినీ దర్శకుడు విజయేంద్ర ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న గల్లా అరుణకుమారి

మాజీ మంత్రి స్వీయ చరిత్ర మహిళలకు స్ఫూర్తి

సినీ దర్శకులు విజయేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి -తవణంపల్లి : మాజీ మంత్రి గల్లా అరుణకుమారి స్వీయ చరిత్ర మహిళలకు ఓ స్ఫూర్తి అని ప్రముఖ సినీ దర్శకుడు, రాజమౌళి తండ్రి, మాజీ ఎంపీ, రచయిత విజయేంద్ర ప్రసాద్ ప్రశంసించారు. ఆదివారం సాయంత్రం చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం దిగువ మాఘం గ్రామానికి విచ్చేశారు, ఈ సందర్భంగా మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి , రామచంద్ర నాయుడు ,మాజీ ఎంపీ గల్లా జయదేవ్, రమాదేవి వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం రాజన్న పార్కుకు చేరుకుని మాజీ ఎంపీ రాజగోపాల్ నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి స్వీయ జీవిత చరిత్రపై ముద్రించిన పుస్తకాన్ని తాను తాను చదివానని ఆమె చరిత్ర తనను ఆలోచింప చేసిందని పేర్కొన్నారు. మంచి తండ్రికి కూతురుగా, మంచి భర్తకు భార్యగా, మంచి పిల్లలకు మంచి తల్లిగా, ప్రజలకు మంచి సేవలు అందించే నాయకురాలిగా ఎదిగిన అరుణమ్మ మహిళలకు స్ఫూర్తి దాయకమన్నారు. అరుణమ్మ జీవిత స్వీయ చరిత్ర లోని అంశాలు ఎలాంటి అబద్ధం, కల్మషం లేకుండా ఉందన్నారు. గల్లా అరుణ కుమారి కుటుంబం అనుమతి ఇస్తే గల్లా అరుణ కుమారీ జీవిత కథ సినిమా కంటే వెబ్ సిరీస్ రూపంలో మరింత ప్రభావితం చేసే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా దిగువమాగం గ్రామంలో గల్లా అరుణ కుమారి ప్రజలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గల్లా అరుణకుమారి చేస్తున్న సేవలు తనను ఎంతో ప్రభావితం చేసిందని ప్రశంసించారు.